"మధురమైన పిల్లలూ - ఇప్పుడు మీ జ్యోతి వెలిగింది, జ్యోతి వెలగడము అంటే అర్థము బృహస్పతి దశ కూర్చోవడము, బృహస్పతి దశ కూర్చోవడంతో మీరు విశ్వానికి యజమానులుగా అవుతారు"

ప్రశ్న:- సత్యయుగంలో ప్రతి ఇంటికి ఉండే విశేషత ఏమిటి, కలియుగములో ప్రతి ఇల్లు ఎలా తయారయ్యింది?

జవాబు:- సత్యయుగంలో ప్రతి ఇంటిలో సంతోషాలు జరుపుకుంటారు. అందరి జ్యోతి వెలిగి ఉంటుంది. కలియుగంలో ప్రతి ఇంటిలో దుఃఖము, చింత ఉంది. ప్రతి ఇంటిలో అంధకారము ఉంది. ఆత్మ జ్యోతి ఆరిపోయి ఉంది. తమ జ్యోతి ద్వారా అందరి జ్యోతులను వెలిగించేందుకు తండ్రి వచ్చారు, తద్వారా మళ్ళీ ప్రతి ఇంటిలోనూ దీపావళి జరుగుతుంది.

పాట:- మాతా, ఓ మాతా...

ఓం శాంతి. పిల్లలు తల్లి మహిమను విన్నారు. వాస్తవానికి ఈ మహిమ అయితే ఒక్కరికే ఉంటుంది. తల్లిని కూడా జగదాంబగా తయారుచేసేవారు, ఆమెకు జన్మనిచ్చేవారు ఇంకెవరో ఉన్నారు. ఇటువంటి తల్లికి కూడా జన్మనిచ్చింది ఎవరు? పతిత-పావనుడైన పరమపిత పరమాత్మ శివుడు ఇచ్చారు అని అంటారు. ఒక్క జ్ఞానసాగరుడు, పతిత-పావనుడు, పరమపిత పరమాత్మ అయిన శివబాబాకే మహిమ జరుగుతుంది. వారు కూర్చొని పిల్లలకు తమ గురించి మరియు తమ రచన యొక్క ఆదిమధ్యాంతాల గురించి మరియు పతితులను పావనంగా తయారుచేసే రహస్యం గురించి అర్థం చేయిస్తారు. ఈ సమయంలో పతిత రాజ్యం ఉందనైతే పిల్లలు అర్థం చేసుకున్నారు, దీనినే రావణ రాజ్యము అంటారు. ఇప్పుడు దసరా వస్తుంది కదా. ఇవన్నీ అంధవిశ్వాసంతో కూడుకున్న ఉత్సవాలని అర్థం చేయించడం జరిగింది. ఒక రావణుడు ఉండేవాడు, ఒక లంక ఉండేది అని ఏమీ కాదు. లంక అని సిలోన్ ను అంటారు. అక్కడ సాగరముపై కోతులు వంతెన కట్టాయి... అన్నట్లుగా చూపిస్తారు. నిజానికి ఇవన్నీ కట్టు కథలు. 10 తలలు ఉన్న రావణుడు ఉండేవాడు, లంకలో రాజ్యం చేసేవాడు అన్నట్లు ఏమీ కాదు. అలాగైతే మరి అతని దిష్టిబొమ్మను లంకలోనే కాల్చాలి కదా. రావణుడిని కాల్చే ఆచారము భారత్ లోనే ఉంది, ఇంకెక్కడా కాల్చరు. వార్తాపత్రికల్లో కూడా ఇక్కడి జరిగే విషయాల గురించే వేస్తారు. ఈ ఉత్సవాన్ని అందరికన్నా ఎక్కువగా మైసూర్ మహారాజే జరుపుతారు. వారికి బహుశా ఈ కట్టు కథపై ప్రేమ ఉన్నట్లుగా కనిపిస్తుంది. ఇప్పుడు ఈ విషయము గురించి అర్థం చేయించడం పిల్లలైన మీ పని. దిష్టిబొమ్మ అయితే శత్రువుదే తయారుచేసి కాలుస్తారు. ఏ విధంగా ఇంతకముందు హిట్లర్ దిష్టిబొమ్మను తయారుచేసి కాల్చేవారు. శత్రువులైతే ఎంతోమందికి ఉంటారు. ఇప్పుడు రావణుడు ఎవరి శత్రువు? భారతవాసుల శత్రువు. కానీ శత్రువును కూడా ఒక్క సారే కాల్చడం జరుగుతుంది. ప్రతి సంవత్సరము శత్రువు దిష్టిబొమ్మను తయారుచేసి కాల్చడము అనేది ఎవరూ చేయరు. శత్రువు దిష్టిబొమ్మను తయారుచేస్తారు కానీ ప్రతి సంవత్సరమైతే కాల్చరు కదా. మరి ఎవరి విషయంలోనైతే ఎంతోకాలంగా భారత్ లో 10 తలలు కల దిష్టిబొమ్మను తయారుచేసి కాలుస్తూ ఉన్నారో, ఆ రావణుడు ఇంతకీ ఎవరు? అసలు మరణించసే మరణించనటువంటి ఇతను ఎప్పటి నుండి శత్రువుగా అయ్యాడు? అసలు చివరికి అంతమవుతాడా లేక సదా ఉంటాడా? భారత్ యే పవిత్రంగా ఉండేదని, మళ్ళీ భారత్ నే రావణుడు వచ్చి అపవిత్రముగా చేసాడని పిల్లలైన మీకు తెలుసు. ఇప్పుడు ఇది రావణ రాజ్యము.

ఒకవేళ లంకకు రాజు ఉంటే మరి రాణి కూడా ఉండాలి. మీరు ఈ విషయాలను ఒప్పుకోరు. రావణుడు ఇప్పటివరకూ జీవించే ఉన్నాడా ఏమిటి, ఏమీ అర్థం చేసుకోరు. అతను జీవించే ఉన్నాడు, అందుకే అతని దిష్టిబొమ్మను తయారుచేసి కాలుస్తూ ఉంటారు. ఒకసారి కాల్చారు, మరి తర్వాత ఏమయ్యింది? ప్రతి సంవత్సరమూ కాలుస్తూ ఉంటారు, కావున పిల్లలైన మీరు అర్థం చేయించాలి. కమిటీకి ఎవరైతే పెద్దలుగా ఉంటారో, ఉదాహరణకు మైసూర్ మహారాజు, అటువంటివారు చాలా బాగా జరుపుకుంటారు. అది చూడడానికి విదేశీయులను కూడా పిలుస్తారు. ఆ విధంగా జరిగి ఉండవచ్చు అని భావిస్తారు. కానీ అలా ఎప్పుడూ జరగలేదు. నాటకాలను అలా తయారుచేస్తారు. రావణుడికి సంబంధించిన నాటకాన్ని కూడా తయారుచేస్తారు. కావున ఈ రావణుడి గురించి అర్థం చేయించాలి. ఇది చాలా ముఖ్యమైన విషయము. ఇప్పుడు మీరు రావణ రాజ్యంలో కూర్చున్నారు. పతిత ప్రపంచాన్నే రావణ రాజ్యము అంటారు. ఇప్పుడు రామ రాజ్యము మరియు రావణ రాజ్యము యొక్క రహస్యాన్ని మీకు అర్థం చేయించడం జరిగింది.

రావణుడు అంటే ఇంకెవరో కాదు, రావణుడు అని పంచ వికారాలను అనడం జరుగుతుంది.

రావణ రాజ్యము ఇప్పుడు భారత్ లో ఉందని మీరు అర్థం చేసుకున్నారు. భారత్ లోనే దసరా, దీపావళి మొదలైనవాటిని జరుపుకుంటారు. కావున అర్థం చేయించవలసి ఉంటుంది. ఒకవేళ రావణుడు జీవించి ఉన్నాడంటే, ఇది రావణ రాజ్యమే అయినట్లు కదా. రావణుడు పతితంగా తయారుచేసేవాడు. ఈ సమయంలో 5 వికారాలు ఏవైతే సర్వవ్యాపకంగా ఉన్నాయో, వాటినే రావణుడు అని అంటారని మీకు తెలుసు. రావణుడి చిత్రాలను ఇంతకుముందు దసరా నాడు తయారుచేసారు, వాటిపై తిథి-తారీఖు కూడా వ్రాయాలి. ఈ సమయంలో పతితుల వినాశనము మరియు పావనుల స్థాపన జరుగుతుంది. మీరు పతితుల నుండి పావనులుగా అవుతున్నారు, పావనులుగా అయ్యారంటే ఇక రావణ సాంప్రదాయానికి నిప్పు అంటుకుంటుంది. రావణుడు అంతమైపోతాడు, ఇక సత్యయుగంలో ఇంకే దిష్టిబొమ్మను తయారుచేయవలసిన అవసరం ఉండదు. అందరూ పావనులుగా అయిపోతారు. ఆత్మలో ఎప్పుడైతే సతోప్రధానత యొక్క శక్తి ఉండేదో, అప్పుడు వెలిగే జ్యోతిలా ఉండేది. పతితంగా అవ్వడంతో ఆ జ్యోతి ఆరిపోయింది. ఆత్మయే పతితముగా అయ్యింది, ఎగిరేటువంటి శక్తి లేదు. 5 వికారాలతో ఆత్మ ఇనుప యుగానికి చెందినదిగా అయిపోయింది. ఇది తప్పకుండా అర్థం చేయించాలి. ఆత్మను జాగృతం చేసేవారు ఒక్క తండ్రే. జ్యోతి స్వరూపుడైన పరమపిత పరమాత్మ వస్తారు అని అయితే అందరూ అంటారు. ఇప్పుడు ఆత్మలైన మీరు కూడా జ్యోతి స్వరూపులే, అలాగే పరమపిత పరమాత్మ కూడా జ్యోతి స్వరూపులే. మీ ఆత్మ జ్యోతి ఆరిపోయింది. కేవలం కొద్దిగా మాత్రమే మిగిలి ఉంది. మనుష్యులు మరణిస్తే రాత్రింబవళ్ళూ వారి దీపాన్ని వెలిగిస్తారు. ఆ దీపాన్ని ఎంతగానో సంభాళిస్తారు. అందులో ఆజ్యము పూర్తయిపోతే మళ్ళీ వేస్తూ ఉంటారు. ఆత్మల విషయంలో కూడా అలాగే జరుగుతుంది. తండ్రి వచ్చి జ్ఞానంతో అందరి జ్యోతిని వెలిగిస్తారు. ఆ జ్యోతి అలా ఎంత సమయం వెలుగుతూ ఉంటుంది? వారు రాత్రివేళ వెలిగిస్తారు, ఇక ఆజ్యము వేస్తూ ఉంటారు. మీ జ్యోతి ఇప్పుడు వెలిగించబడుతూ ఉంది. అలా వెలిగించబడుతూ-వెలిగించబడుతూ ఇక పూర్తిగా వెలిగిపోతుంది. జ్యోతి ఆరిపోవడానికి 5000 సంవత్సరాలు పడుతుంది, అప్పుడు తండ్రి వచ్చి ఆజ్యాన్ని వేస్తారు. మీ జ్యోతి ఇప్పుడు వెలిగింది, తర్వాత నెమ్మది-నెమ్మదిగా కళలు తగ్గుతూ ఉంటాయి, అప్పుడు జ్యోతి ఆరిపోతుంది. మీకు తెలుసు, ఇప్పుడు మన జ్యోతి వెలుగుతుంది, ఇక తర్వాత సత్యయుగంలో ఇంటింటిలోనూ ప్రకాశము ఉంటుంది. ఇది భారత్ కు సంబంధించిన విషయమే. ఇప్పుడైతే ఇంటింటిలోనూ అంధకారము ఉంది. సంతోషము లేదు. సత్య-త్రేతాయుగాలలో మనం చాలా సంతోషంగా ఉండేవారమని మరియు సంతోషాలను జరుపుకునేవారమని మీకు తెలుసు. అక్కడ అందరి జ్యోతి వెలిగి ఉంటుంది, తర్వాత నెమ్మది-నెమ్మదిగా తగ్గుతూ ఉంటుంది. ఈ సమయంలో పూర్తిగా ఆరిపోయి ఉంది, మాలిన్యం కలిసింది. తండ్రి వచ్చి మళ్ళీ జ్ఞానమనే ఆజ్యాన్ని వేస్తారు, తద్వారా మీరు మళ్ళీ వెలుగుతూ ఉన్న జ్యోతులుగా అవుతారు. మీ జ్ఞాన నేత్రాలు తెరుచుకుంటాయి.

ఇప్పుడు మన శరీరమంతా సమాప్తమైపోయిందని, రాహు గ్రహణం పట్టి ఉందని మీకు తెలుసు. మీరు నల్లగా అవ్వడానికి ఎంత సమయం పడుతుంది? ప్రారంభం నుండి కొద్ది-కొద్దిగా నల్లగా అవుతూ ఆ తర్వాత మాయ ప్రవేశించడంతో చాలా నల్లగా అయిపోతారు. ఇప్పుడు మీపై రాహువు దశ ఉంది. అన్నింటికన్నా కఠినమైనది రాహు దశ. ఇప్పుడు మళ్ళీ బృహస్పతి దశ కూర్చుంటుంది, ఎందుకంటే ఇప్పుడు విశ్వానికి యజమానులుగా అయ్యేందుకు మీరు వృక్షపతి అయిన గురువు ద్వారా పురుషార్థం చేస్తున్నారు. వారు అవినాశీ గురువు. ఎవరికి? అవినాశీ ఆత్మలకు. ఆ మనుష్యులు ఆత్మలకు గురువుగా అవ్వరు. వారు మనుష్యులకు గురువుగా అవుతారు. ఇప్పుడు తండ్రి వచ్చి ఆత్మలైన మీకు గురువుగా అయ్యారు. వృక్షపతి పరమపిత పరమాత్మయే. ఇప్పుడు మనపై బృహస్పతి దశ కూర్చుందని మీరు అర్థం చేసుకున్నారు. స్వర్గానికి యజమానులుగా అయితే అవుతారు. అక్కడ అవినాశీ సుఖము ఉంటుంది, కానీ దాని కొరకు - మేము సుఖధామానికి మహారాజు, మహారాణిగా అవ్వాలి అని ఇప్పుడు పురుషార్థం చేయాలి. ప్రతి ఒక్కరిదీ తమ-తమ పురుషార్థం నడుస్తూ ఉంటుంది. ఇది రుద్రుడైన శివుని పాఠశాల. వారు జ్ఞాన సాగరుడు. మీరు వారి పాఠశాలలో చదువుతున్నారు. భగవానువాచ - నేను మీకు రాజయోగాన్ని నేర్పిస్తాను. అవినాశీ ఆత్మల అవినాశీ తండ్రిని నేనే. ఒకరు దైహిక తండ్రి, ఒకరు ఆత్మిక తండ్రి. వారిరువురి తారతమ్యాన్ని కూడా తెలియజేయాలి. ఆత్మిక తండ్రి ఎప్పుడు లభిస్తారు, వారిని భక్తి మార్గంలో ఆత్మలందరూ తలచుకుంటారు. దైహిక తండ్రి వినాశీ. ఆత్మలు వినాశీ కావు. మన లౌకిక తండ్రి ఎవరైతే ఉన్నారో, వారిని మనం జన్మ-జన్మలుగా మారుస్తూ వచ్చామని మీకు తెలుసు. తండ్రి లేకుండా పిల్లల జన్మ జరగదు. పిల్లలైన మీకు ఇప్పుడు విశాల బుద్ధి లభించింది. మనము ఇద్దరు తండ్రులకు చెందినవారిగా ఎప్పటి నుండి అవుతాము అనేది మీరు అర్థం చేసుకోగలరు. సత్యయుగంలో ఒక్క లౌకిక తండ్రే ఉంటారు, వారినే తలచుకుంటారు. అక్కడ ఆత్మలకు ఆ ఆత్మిక తండ్రిని స్మృతి

చేయవలసిన అవసరముండదు. ఆత్మలకు సత్యయుగంలో ఒక్క లౌకిక తండ్రే ఉంటారు. అక్కడ శరీరము కూడా సుందరమైనది లభిస్తుంది, ప్రారబ్ధాన్ని అనుభవిస్తారు కదా, అందుకే అక్కడ తండ్రిని తలచుకోరు. మీరు ఈ విషయాలను అర్థం చేయించాలి. భక్తి మార్గంలో ఒకరేమో వినాశీ లౌకిక తండ్రి ఉంటారు, వారు ప్రతి జన్మలో వేరే-వేరుగా లభిస్తారు. ఆత్మలైన మీరైతే అవినాశీ, మీరు అవినాశీ తండ్రిని స్మృతి చేస్తారు. పరమపిత, పరంధామంలో ఉండే పిత అని కూడా అంటారు. లౌకిక పితను ఎప్పుడూ పరమపిత అని అనరు. ఈ ఇద్దరు తండ్రుల రహస్యాన్ని అర్థం చేయించడం ఎంతో అవసరము. రావణుడి రహస్యాన్ని కూడా అర్థం చేయించాలి. రావణ రాజ్యము అనగా పతిత రాజ్యము ఇప్పుడే ఉంది, అందుకే పతిత-పావనుడైన తండ్రిని పిలుస్తున్నారు, వారు అవినాశీ తండ్రి. ఇద్దరు తండ్రులను తప్పకుండా నిరూపించి చెప్పాలి. ఆత్మలకు కూడా తండ్రి ఉంటారు, అందుకే పారలౌకిక పరమపిత పరమాత్మను స్మృతి చేస్తారు. ప్రతి జన్మలో లౌకిక తండ్రులు వేరు-వేరుగా లభిస్తారు, అయినా కానీ ఆ ఆత్మిక తండ్రిని తప్పకుండా తలచుకుంటారు. వారు ఎప్పుడూ మారరు. తండ్రి కూడా అంటారు - మీరు 'ఓ పరమపిత పరమాత్మా' అని నన్ను తప్పకుండా తలచుకునేవారు. వారిని మీరు ఎప్పటివరకూ స్మృతి చేయాల్సి ఉంటుంది, ఆ తండ్రి ఎప్పుడు లభిస్తారు, ఇది మీరు ఇప్పుడు తెలుసుకున్నారు. ఎప్పుడైతే భక్తి పూర్తవుతుందో, అప్పుడు భక్తులకు ఫలాన్ని ఇవ్వడానికి తండ్రి వస్తారు. భక్తులందరికీ ముక్తి-జీవన్ముక్తులను ఇస్తాను అని తండ్రి అర్థం చేయించారు. సత్యయుగంలో ఒకే ధర్మముంటుందని, దానిని ఐక్యత అంటారని మీకు తెలుసు. అందరూ కలిసి ఒక్కటైపోవాలి అని అంటారు. కానీ అన్ని ధర్మాలూ ఒక్కటిగా అవ్వలేవు. ఎప్పుడైతే ఒకే రాజ్యము ఏర్పడుతుందో అప్పుడు పవిత్రత, సుఖ-శాంతులు ఉంటాయి. భారత్ లో తప్పకుండా రామ రాజ్యము ఉండేది. ఇప్పుడు ఇది రావణ రాజ్యము, అందుకే రావణుడిని కాలుస్తూ ఉంటారు. ఇద్దరు తండ్రుల రహస్యాన్ని అర్థం చేయించడం ద్వారా వెంటనే అర్థం చేసుకుంటారు. అవినాశీ తండ్రి అయితే తప్పకుండా ఉన్నారు. కొత్త ప్రపంచాన్ని రచించేవారు ఆ తండ్రే. కొత్త ప్రపంచంలో తప్పకుండా దేవీ-దేవతలే ఉండేవారు, తిరిగి అదే ప్రపంచము కొత్తది నుండి పాతదిగా అవుతుంది. కొత్త ప్రపంచంలో ఎన్ని జన్మలు తీసుకుంటారు, పాత ప్రపంచంలో ఎన్ని జన్మలు తీసుకుంటారు, ఇది మీకు తెలుసు. అలాగని 84 జన్మలలో సగం-సగం ఉంటాయని కాదు, 42 జన్మలు పాత ప్రపంచంలో, 42 జన్మలు కొత్త ప్రపంచంలో ఉంటాయని కాదు. భారతవాసుల ఆయువు మొదట్లో 100 సంవత్సరాలు, 125 సంవత్సరాలు ఉండేది, ఇప్పుడైతే 40-50 సంవత్సరాలు కూడా కష్టం మీద ఉంటుంది. కావున సగం-సగం కుదరదు. 84 జన్మల లెక్క అయితే ఉండాలి కదా. తండ్రి అంటారు, మీ 84 జన్మల చక్రము ఇప్పుడు పూర్తయ్యింది. ఇది మీకు తెలియదు, నేను అర్థం చేయిస్తాను. 84 జన్మల రహస్యాన్ని పరమపిత పరమాత్మ తప్ప ఇంకెవ్వరూ అర్థం చేయించలేరు. మీరు తండ్రి ద్వారా విని సంతోషిస్తారు మరియు కొత్త ప్రపంచం కోసం పురుషార్థం చేస్తారు.

ఇప్పుడు మనం అనంతమైన పారలౌకిక తండ్రి నుండి అనంతమైన వారసత్వాన్ని తీసుకుంటున్నామని పిల్లలైన మీరు నిరూపించి చెప్పాలి. ఎప్పుడైతే స్వర్గ స్థాపన చేస్తారో, అప్పుడే ఆ తండ్రి వస్తారు. వారిని హెవెన్లీ గాడ్ ఫాదర్ అంటారు. ఎప్పుడైతే కొత్త ఇంటి స్థాపన జరుగుతుందో, అప్పుడు పాత ఇంటిని కూలగొట్టడం జరుగుతుంది. స్థాపన మరియు వినాశనము అని వ్రాయబడి కూడా ఉంది. ఎప్పుడైతే స్థాపన పూర్తవుతుందో, అప్పుడు వినాశనం జరుగుతుంది. స్థాపన చేసేది పరమపిత పరమాత్మ, ఈ బ్రహ్మా ద్వారా. సూక్ష్మవతనవాసిని ప్రజాపిత అని అనరని కూడా బాబా అర్థం చేయించారు. అక్కడ ప్రజలు ఉండరు, కావున తప్పకుండా ప్రజాపిత బ్రహ్మా ఇక్కడే ఉంటారు. వారే మళ్ళీ అవ్యక్తముగా, సంపూర్ణముగా అవుతారు. వారు అవ్యక్తమైనవారు. అయితే తప్పకుండా వ్యక్తములో ఉన్నవారు కూడా ఉండాలి, వారే మళ్ళీ అవ్యక్తునిగా అవుతారు. ఇప్పుడు ఇద్దరూ కనిపిస్తారు. ప్రజాపిత బ్రహ్మా ఇక్కడ కూడా ఉన్నారు, సూక్ష్మవతనంలో కూడా ఉన్నారు. ప్రజాపిత అయితే ఇక్కడే కావాలి. తప్పకుండా ప్రజాపిత బ్రహ్మా పిల్లలు కూడా ఇక్కడే ఉన్నారు. ప్రదర్శనీలో ఇద్దరు తండ్రుల రహస్యాన్ని అర్థం చేయించాలి. నియమం పరంగానైతే ప్రతి ఒక్కరికీ వేరు-వేరుగా అర్థం చేయించడం జరుగుతుంది. కానీ అక్కడ ఎవరికైనా ఎలా అర్థం చేయిస్తారు? అర్థం చేయించేందుకు ఏకాంతము కావాలి. అక్కడైతే ఎంతో హంగామా ఉంటుంది. ఇక్కడైతే మీకు అర్థం చేయించేందుకు గంట, గంటన్నర పడుతుంది. అక్కడ అంత గుంపులో అర్థం చేయించడం చాలా కష్టమవుతుంది. అనేక రకాల ధర్మాలవారు ఉంటారు. ఒక్కొక్కరు ఒక్కోలా అంటూ ఉంటారు. మౌనంగానైతే ఉండరు కదా. మీరు ఇలా వినిపిస్తారు - ఒకరేమో లౌకిక దైహిక తండ్రి, ఇంకొకరు పారలౌకిక ఆత్మిక తండ్రి, వారే పరమపిత పరమాత్మ, ఇప్పుడు బ్రహ్మా ద్వారా స్వర్గ స్థాపనను చేస్తున్నారు, నరకము యొక్క వినాశనము కూడా ఎదురుగా ఉంది. మహాభారీ యుద్ధము ఉంది కదా. తప్పకుండా ఇది రాజయోగము కూడా, రాజ్యాన్ని ప్రాప్తి చేసుకునేందుకు ఇది గీతా పాఠశాల. భగవానువాచ - అందరికీ ఇద్దరు తండ్రులు ఉంటారు. శ్రీకృష్ణుడిని ఆత్మలందరికీ తండ్రి అని అనరు. ఆత్మల తండ్రి అయిన పరమపిత పరమాత్మ చెప్తున్నారు -

నన్నొక్కరినే స్మృతి చేయండి. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. స్వయములో జ్ఞానమనే ఆజ్యాన్ని వేస్తూ సదా వెలుగుతూ ఉండే జ్యోతులుగా ఉండాలి. తండ్రి స్మృతిలో ఉంటూ రాహు గ్రహణాన్ని తొలగించుకోవాలి.

2. ఆత్మిక మరియు దైహిక తండ్రులు ఇరువురూ ఉన్నారు, ఈ పరిచయాన్ని ప్రతి ఒక్కరికీ ఇచ్చి అనంతమైన వారసత్వానికి అధికారులుగా చేయాలి.

వరదానము:- ప్రవృత్తిలో ఉంటూ ఒక్క తండ్రితో కంబైండ్ గా ఉండే దేహ సంబంధాల నుండి నివృత్త భవ

ప్రవృత్తిలో ఒకవేళ పవిత్ర ప్రవృత్తి యొక్క పాత్రను పోషించాలంటే దేహ సంబంధాల నుండి నివృత్తిగా ఉండండి. నేను పురుషుడిని, వీరు స్త్రీ - ఇటువంటి భానము స్వప్నములో కూడా రాకూడదు. ఆత్మలు పరస్పరం సోదరులు అన్నప్పుడు స్త్రీ-పురుషులు అన్నది ఎక్కడి నుండి వచ్చింది. మీరు మరియు బాబా యుగళులు. వీరంతా సేవార్థము నిమిత్తమాత్రముగా ఉన్నారు, ఇకపోతే కంబైండ్ రూపములో మీరు మరియు బాబాయే ఉన్నారు. ఇలా భావించి నడుచుకున్నట్లయితే ధైర్యశాలీ, విజయీ ఆత్మ అని అంటారు.

స్లోగన్:- సదా సంతుష్టంగా మరియు సదా సంతోషంగా ఉండేవారే అదృష్టవంతులు, తీవ్ర పురుషార్థులు.